క్లుప్తంగా

మురుగుకాల్వలు శుభ్రం



కాల్వను శుభ్రం చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

కుభీర్: మండలకేంద్రంలోని మురుగుకాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో ఈనెల 26లో సాక్షిలో మురుగు ఇలా.. ఇంట్లోకి వెళ్లేదెలా శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పారిశుధ్య కార్మికులు మురుగుకాల్వలను శుభ్రం చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన వారసంత వేలం

నిర్మల్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నర్సాపూర్(జి) మండలకేంద్రంలో వారసంత నిర్వహణకు గురువారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా నర్సాపూర్ (జి)కే చెందిన మహమ్మద్ మొహినుద్దీన్ రూ.2,32,278లకు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ తెలిపారు. కార్యక్రమంలో కారోబారి సట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29న తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణంలోని వారసంతతోపాటు మార్కెట్ పరిధిలో రైతులు, పలువురు వ్యాపారుల నుంచి పన్నుల వసూళ్లకు గాను ఈనెల 29న తైబజార్ వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనేవారు నిబంధనలు పాటిస్తూ కమిషనర్ పురపాలక సంఘం ఖానాపూర్ పేరిటపై రూ.లక్ష డీడీ తీసి కార్యాలయ పనివేళల్లో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేశ్



సురేశ్‌కు ఎన్నిక పత్రం ఇస్తున్న అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా 30 మంది న్యాయవాదులకుగానూ 28 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా మంత్రరాజం సురేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజలింగం, కోశాధికారిగా రాజు, సహాయ కార్యదర్శిగా కమలాకర్, లైబ్రరీ కార్యదర్శిగా సురేందర్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు కామోజీ వేణుగోపాల్, షబ్బీర్‌పాషా తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో సీ5, సీ6 బ్లాక్‌లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. గురువారం కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాజవ్వ, విజయలక్ష్మి, చంద్రకళ, లావణ్య తదితరులున్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఖానాపూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంజేపీ(మహాత్మ జ్యోతిబాపూలే) బాలుర పాఠశాల ప్రత్యేకాధికారి రత్నాకర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ఎంజేపీని సందర్శించారు. మెనూ, పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సంతోష్ ఉన్నారు.

పేదలకు సరుకులు అందజేత



సరుకులు అందిస్తున్న సంస్థ సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని సోఫీనగర్‌లో నిరుపేద ట్రాన్స్‌జెండర్ కుటుంబాలతో పాటు, భర్త లేని వారికి స్వచ్ఛ హృదయ సేవా వికాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రూ.15 వేల విలువైన నిత్యావసర సరుకులు అందించారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సభ్యులు పేర్కొన్నారు. ఇందులో సంస్థ సభ్యులు ఉన్నారు.

మామడ ఎస్సైగా అశోక్

మామడ: మామడ ఎస్సైగా టి. అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సందీప్ బదిలీపై నిర్మల్ వెళ్లారు. నూతన ఎస్సైని మండలంలోని మాజీ సర్పంచ్‌లు సన్మానించారు. భూమేశ్వర్, హన్మాగౌడ్, గంగాధర్, శ్రీనివాస్, గంగారాం ఉన్నారు.

మూగజీవాల రోదన పట్టేదెవరికి..

- ప్లాస్టిక్‌వ్యర్థాలు తింటూ మృత్యువాత
- బాసరలో గోశాల ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



శారదనగర్‌లో గుంపుగా తిరుగుతున్న పశువులు



డంపింగ్‌యార్డు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న పశువులు

బాసర: మండలకేంద్రంలో మూగజీవాల సంరక్షణను కొందరు యజమానులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ మృత్యువాత పడుతున్నాయి. మండలకేంద్రంలోని పోచమ్మగల్లి రైతువేదిక పరిసరాలతోపాటు కాలనీలు, రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తుండటంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. వీటి కారణంగా కొందరు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు జంతుప్రేమికులు మూగజీవాలకు ఆహారం అందిస్తున్నా.. సరిపోవడం లేదు. డంపింగ్‌యార్డుల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు తింటుండటంతో అవి జీర్ణం కాక అస్వస్థతకు గురై మృతి చెందుతున్నాయని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు.

గోశాల ఏర్పాటు చేస్తే మేలు..

విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను నియంత్రించేందుకు మండలకేంద్రంలో గోశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. ముజ్గి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఇన్ పేషెంట్ వార్డు, ఆయుష్ క్లినిక్, డ్రగ్స్ స్టోరూంను సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న సదుపాయాలపై వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యశాఖ అధికారులు శ్రీనివాస్, రవీందర్, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తానూరు: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంతోపాటు సింగన్‌గాం గ్రామాల్లో పర్యటించారు. ఆయా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సింగన్‌గాంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం తానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం సాయిబాబును అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. తానూరు బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం పరిశీలించారు. ఎంపీడీవో నసిరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, సిబ్బంది ఉన్నారు.

హవర్గలో..

లోకేశ్వరం: మండలంలోని హవర్గలోని నర్సరీని ఎంపీడీవో ఎంపీడీవో వెంకటరమేశ్ పరిశీలించారు. పిచ్చిమొక్కలు తొలగించి, చెత్తాచెదారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏ రవీందర్ ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో సరిత

కడెం: అంగన్‌వాడీ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. గురువారం మండలంలోని మారుమూల గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, లక్ష్మీపూర్, దుబ్బతండా, మొర్రిపేట్, దత్తోజీపేట్, అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పాఠశాలలో ముందస్తు ఉగాది



పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది పర్వదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రభవ నుంచి అక్షయ వరకు తెలుగు సంవత్సరాల పేర్లను పోస్టర్లపై రాసి ప్రదర్శించారు. ఎంఈవో పరమేశ్వర్ మాట్లాడారు. పోస్టర్లపై తెలుగు సంవత్సరాల పేర్లను రాసిన విద్యార్థులను కొనియాడారు. ఉపాధ్యాయుడు రమేశ్‌బాబు, మంగమ్మ రాధ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, మైనారిటీ యువకులకు స్పార్క్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ డీడీయూ–జీకేవై టెలి హెల్త్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ (5నెలలు) ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (7 నెలల) కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ కలిగి 18 నుంచి 30 ఏళ్లున్న వారు శిక్షణకు అర్హులని తెలిపారు. ఈనెల 29న నిర్మల్ కొయ్యబొమ్మల కేంద్రం పక్కన గల నిర్మల్ మండల సమాఖ్య(ఐకేపీ) ఆఫీసు నందు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో భోజన వసతితోపాటు కల్పించి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలో గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తారువిందు ఏర్పాటు చేశారు. ఏడీఈ శ్రీనివాస్, సిబ్బంది నజీర్, ప్రేమ్, సత్యనారాయణ, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతికి సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు జీఎల్‌వీ ప్రసాద్ కూతురు లక్ష్మీప్రసన్న పంచాయతీ రాజ్ ఏఈగా ఉద్యోగం సాధించింది. దీంతో శివాజీనగర్ కాలనీ అధ్యక్షుడు కరిపె శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలనీవాసులు యువతిని సన్మానించి స్వీట్లు తినిపించారు.

భూమిపూజ

సారంగపూర్: మండలంలోని కొట్ల(బి) గ్రామంలోని శాంతినగర్ కాలనీ నుంచి పెద్దమ్మ గుడి వరకు రూ.30లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి గురువారం భూమిపూజ నిర్వహించారు. రాంరెడ్డి, సత్యపాల్ రెడ్డి, లస్మన్న, రమణ, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మామడ: విద్యార్థులు ఇష్టపడి అవగాహనతో చదువుకోవాలని మహాత్మాజ్యోతిబా పూలే గురుకులాల జాయింట్ సెక్రటరీ తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాచాపూర్ గురుకులం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, పీఈటీ శ్రీకాంత్, నాగరాజు, నర్సయ్య, వెంకట్ పాల్గొన్నారు.

మీసేవ నిర్వాహకులతో సమావేశం

మామడ: మండలంలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులతో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం యోజనకు దరఖాస్తుదారులకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మీసేవా కేంద్రాల నిర్వాహకులు అశోక్, సుధాకర్, నరేశ్, సురేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

వడదెబ్బపై కళాజాత

నిర్మల్: నర్సాపూర్(జి)లో గురువారం సాంస్కృతిక కళాకారులు కళాజాత నిర్వహించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటు హక్కు, ప్రభుత్వ పథకాలు, పచ్చదనం పరిశుభ్రత గురించి పాటల రూపంలో వివరించారు. కార్యదర్శి రాథోడ్ కైలాస్, ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, శ్రీనివాస్, కళాకారుల బృందం పాల్గొన్నారు.

ఇందిరమ్మ నిర్మాణాలు పరిశీలన

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మండలంలోని విఠాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేయగా గురువారం ఎంపీడీవో లింబాద్రి పనులను పరిశీలించారు. కార్యదర్శి ఉత్తం, ఎఫ్ఏలు, సుదర్శన్, సాయి ఉన్నారు.

ఫైలేరియాపై అవగాహన

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఫైలేరియాపై ఇంటింటా అవగాహన కల్పించారు.వైద్యురాలు శృతిరెడ్డి పాల్గొన్నారు.

ఈరోజు

నిర్మల్‌లో కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్‌స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే వైద్య శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారసంత వేలం

తానూరు: ఏడాదిపాటు మండలకేంద్రంలోని వారసంత నిర్వహణకు గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జలంసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గినవారు రూ.10 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

శాస్త్రీయ పద్ధతుల్లో పంటలు పండించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేందర్

ఖానాపూర్: రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో పసుపు పంట సాగు చేస్తే పెట్టుబడి తగ్గి.. దిగుబడులు పెరుగుతాయని కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ అన్నారు. గురువారం మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో ఆదిలాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ, అరణ్య శాశ్వత వ్యవసాయసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా యాజమాన్య పద్ధతులు, పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా వివరించారు. అనంతరం పసుపు పరిశోధన స్థానం కమర్‌పల్లి ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాల సంస్థ తయారు చేసిన పసుపు ఉత్పత్తి పెరుగుదల ప్యాకెట్లను రైతులకు అందజేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి రమణ, డివిజన్ ఉద్యానవన అధికారి వందన, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, సీఈవో సుమన్, డైరెక్టర్లు, అధికారులు, రైతులు ఆనంద్‌రావు, నారాయణ, సురేశ్, ఎల్లిబాయి, సుజాత, రమ్య ఉన్నారు.

అగ్నివీరులుగా జిల్లా యువకులు



పి.శ్రీనివాస్



అరిగెల అరుణ్



కృష్ణసాయి



మోరె వంశీ



రాజశేఖర్

కుంటాల: మండలకేంద్రానికి చెందిన ప్యాదరి శ్రీనివాస్, అరిగెల అరుణ్, మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన కార్గాం కృష్ణసాయి, ఓలా గ్రామానికి చెందిన మోరె వంశీ అనే యువకులు జనరల్ డ్యూటీ విభాగంలో అగ్నివీరులుగా ఎంపికయ్యారు. అగ్నిపథ్ పథకం కింద వీరికి గతేడాది మార్చి 28న సీబీటీ ఆన్‌లైన్ పరీక్ష, డిసెంబర్ 4 నుంచి 19 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. గురువారం విడుదల చేసిన మెరిట్ జాబితాలో కుంటాల యువకులు ఉన్నారు. కాగా వీరిని పలువురు అభినందించారు.

నిర్మల్: నర్సాపూర్(జి) మండలం అర్లి(కే) గ్రామానికి చెందిన పోసాని–రాములు దంపతుల కుమారుడు రాజశేఖర్ అగ్నివీర్‌గా ఎంపికయ్యాడు. తల్లి బీడీ కార్మికురాలు కాగా తండ్రి వ్యవసాయం చేస్తున్నాడు. రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



కామోల్‌లో చార్జ్ చేస్తున్న ఎస్ఈ సుదర్శనం

భైంసాటౌన్: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ సుదర్శనం తెలిపారు. భైంసా డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఏడు 11కేవీ ఫీడర్ బ్రేకర్లకు చార్జింగ్ చేసినట్లు తెలిపారు. రాజురా, కామోల్, బిద్రెల్లి, బ్రాహ్మణ్‌గావ్, సోనారి, లింబా సబ్‌స్టేషన్ల పరిధిలో వీటిని ఏర్పాటు చేశామని, తద్వారా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వెంట డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ మోహన్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామ సబ్‌స్టేషన్‌లో రెండు బ్రేకర్లను ఎస్ఈ ప్రారంభించారు.

‘రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర’



తానూరు: వడ్గాం గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న నారాయణ్‌రావు పటేల్, నాయకులు



కుభీర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు నారాయణ్‌రావ్ పటేల్ అన్నారు. గురువారం మండలంలోని హిప్నెల్లి, వడ్గాం గ్రామాల్లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. కుల, మత, వర్గాలకు ముందుకు వెళ్లాలని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్ ,కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుండలిక్, ,గోవింద్‌రావ్ పటేల్ ,పోతరెడ్డి ,మధుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కుభీర్: కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. కార్యకర్తలకు సూచించారు. గురువారం కుభీర్‌లో జైబాపు.. జైభీం.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. జైబాపు.. జైభీం.. జైసంవిధాన్ కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్ మాట్లాడుతూ కొందరు అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి, నారాయణ్‌రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, విజయ్, రాములు, పెంటాజీ, సంతోష్, దత్తురాం పటేల్, మహిపాల్‌రెడ్డి, జయరాం ఉన్నారు.

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, కార్యక్రమ మండల ఇన్‌చార్జి బాపన్న జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముడికె మల్లేశ్‌యాద్, మండలాధ్యక్షుడు రెంకల శ్రీనివాస్, తరి శంకర్, సంతోశ్, వెంకటేశ్, లచ్చన్న, రమేశ్, తదితరులున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బీజేపీ ప్రభుత్వం

ఖానాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలన కొనసాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ అన్నారు. గురువారం పట్టణంలో ఖానాపూర్ ఇన్‌చార్జులుగా నియమితులైన ఎంబడి రాజేశ్వర్, అయ్యన్నగారి పోశెట్టి ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్, మహాత్మగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. చిన్నం సత్యం, మాజిద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, షౌకత్‌పాషా, గంగాధర్, రాజునాయక్, శంకర్, లక్ష్మీపతిగౌడ్, రాజేశ్వర్, రమేశ్, రాజన్న, తదితరులు ఉన్నారు.

నువ్వు పంట క్షేత్రదినోత్సవం

ఖానాపూర్: మండలంలోని చందునాయక్‌తండా, కొలాంగూడ, బావాపూర్(ఆర్) తండాల్లో నువ్వు పంట క్షేత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ భారతీయ నూనె గింజల పరిశోధనస్థానం, సేవాస్ఫూర్తి ఫౌండేషన్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రైతులకు షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక పథకంలో భాగంగా అధిక దిగుబడిని ఇచ్చే నువ్వు విత్తనాలను అందజేశారు. యాజమాన్య పద్ధతులపై పరిశోధన స్థానం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త సురేశ్ అవగాహన కల్పించారు. రైతులకు టార్పాలిన్ పట్టీలు, వేపమందులు, హెర్మాటిక్ సంచులు 150 ఉచితంగా అందజేశారు. ప్రసాద్, రత్నకుమార్, రమ్య, రత్నాకర్, మంగేశ్, వినేష్, హేమ్లా, దినేశ్, లింబారావు, రామారావు, అఖిల్ ఉన్నారు.

సంప్రదాయాలు కాపాడాలి

కుంటాల: మన సంస్కృతి, సంప్రదాయాల ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ పేర్కొన్నా రు. గురువారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు



ముధోల్ స్టేషన్ వద్ద నాయకులు

ముధోల్: తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మండలంలోని మాజీ సర్పంచ్‌లను గురువారం ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు.మాజీ సర్పంచ్ రాజేందర్ తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ అన్నారు. భుజంగ్‌రావు, కపిల్, సాయన్న, దిగంబర్ ఉన్నారు.

సోన్: అసెంబ్లీని ముట్టడిస్తారనే సమాచారంతో మండలంలోని మాజీ సర్పంచులను గురువారం తెల్లవారుజామున అరెస్టు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. వినోద్‌కుమార్, నవీన్, శ్రీనివాస్, ఎల్లయ్య, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



వస్త్రం కప్పి పూజలు చేసిన గ్రామస్తులు

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలో నిత్యం ఇళ్ల మధ్యనే తిరుగుతూ వారు పెట్టే ఆహారం తింటూ పెరిగిన గోమాత గురువారం మృతి చెందడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గోమాతకు నూతన వస్త్రాలు చుట్టి పూలు చల్లారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ వాగు ఒడ్డుకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, శేఖర్, దేవేందర్, ప్రకాష్, సాయి, చేతన్ తదితరులు ఉన్నారు.

అమ్మవారి సన్నిధిలో రాజయోగి

బాసర:బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని గురువారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం సిద్ధాశ్రమం అనంతసాగర్, లింగంగుట్ట పీఠాధిపతి శ్రీ రాజయోగి దర్శించుకున్నారు. అనంతరం అర్చకులతో కలిసి నూతన తెలుగు పంచాంగాలకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసర ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రిని కలిసి బాసర సరస్వతి ఆలయ అభివృద్ధిపై మాట్లాడతానని వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను పెండింగ్ ఉన్న బకాయిదారులకు ప్రభుత్వం వడ్డీపై 90శాతం మాఫీ అవకాశం కల్పించిందని కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఈనెల 31 వరకు కల్పించిన అవకాశాన్ని పట్టణంలోని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదివరకే వడ్డీ చెల్లిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నులో సర్దుబాటు చేస్తామని పేర్కొన్నారు. పన్నులు చెల్లించని వారి నీటి కుళాయిల కనెక్షన్లు తొలగించడంతో పాటు ఆస్తుల జప్తు చర్యలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.